నమస్తే తెలంగాణ

# నల్లగొండ

5 | నల్లగొండ, సోమవారం 21 అక్టోబర్ 2024 | NALGONDA


## 20 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



20 క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న సాగర్ నీటి విడుదల

నందికొండ, అక్టోబర్ 19 : నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో పెరుగడంతో ఆదివారం డ్యామ్ 20 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువ విడుదల చేశారు. శ్రీశైలం నుంచి 2,44,132 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుండడంతో, డ్యామ్ 14 క్రస్ట్ గేట్లను 5 అడుగులు, 6 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,02,678 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఎడమ కాల్వ ద్వారా 6,173 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 3,371 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,110 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 400 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. క్రస్ట్ గేట్లు, జలవిద్యుత్ కేంద్రాలు, కాల్వల ద్వారా మొత్తం 2,44,132 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉన్నది.




మిర్యాలగూడలో ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి నాయకులు




సూర్యాపేటలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న మాజీ ఎంపీ బడుగుల, బీఆర్ఎస్ నాయకులు

# రైతు బంధు ఎగవేతపై ఆగ్రహ జ్వాల

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు, బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనలు
- సీఎం రేవంత్, మంత్రి తుమ్మల దిష్టిబొమ్మల దహనం
- పలుచోట్ల పాల్గొన్న మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

## కాంగ్రెస్ సర్కారుపై భగ్గుమన్న రైతన్న



త్రిపురారం : నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు.

**వానకాలం సీజన్‌కు సంబంధించి రైతు బంధు ఇవ్వలేమని చెప్పిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యాఖ్యలను నిరసిస్తూ ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా రైతులతో కలిసి బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు, ధర్నాలు చేశారు. జిల్లా, మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి రాస్తారోకోలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, త్రిపురారంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ట్రైకార్ మాజీ చైర్మన్ రామచందర్‌నాయక్, మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, ఆత్మకూర్ ఎం.లో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ పాల్గొన్నారు. పలుచోట్ల జరిగిన నిరసనల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతోపాటు రైతులు పెద్ద ఎత్తున భాగస్వామ్యమయ్యారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాయమాటలతో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశాడని దుయ్యబట్టారు. వెంటనే రైతు బంధు ఇవ్వకపోతే రైతుల ఆగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు.**

– సూర్యాపేట, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ)



తిరుమలగిరి : రైతు భరోసా ఎగవేత పై నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు




శాలిగౌరారంలో రైతులతో కలిసి రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



దేవరకొండ : బస్టాండ్ సెంటర్‌లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల నిరసన




నేరేడుచర్ల : సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# మీ త్యాగం అజరామరం

- నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- ఈ నెల 31 వరకు పోలీస్ ఫ్లాగ్ డేతో ప్రత్యేక కార్యక్రమాలు

నీలగిరి/సూర్యాపేట టౌన్, అక్టోబర్ 20 : అను నిత్యం విధి నిర్వహణలో అప్రమత్తం.. సమాజ శాంతి కోసం నిరంతరం విధులు.. ఎన్నో సవాళ్లు.. మరెన్నో సమస్యలు.. మానసిక ఒత్తిళ్లను అధికమిస్తూ కత్తిమీద సాము చేస్తున్నారు పోలీసులు. మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతున్న పోలీసులకు ప్రజలు సెల్యూట్ చేస్తున్నారు. పోలీసులకు ప్రశంసలతోపాటు ప్రమాదం కూడా వెన్నంటి ఉంటుంది. ఉగ్రవాదం, తీవ్రవాదం, అసాంఘిక శక్తుల నుంచి పొంచి ఉన్న ప్రమాదంలో పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అసాంఘిక శక్తులతో పోరాడి అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి. సమాజ శ్రేయస్సు కోరి అసాంఘిక శక్తులకు ఎదురొడ్డి పోరాడి అమరులైన పోలీసు అమర వీరులకు జోహార్లు. నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఏర్పాట్లు చేసింది.



### ఉమ్మడి జిల్లాలో 30 మంది పోలీసు అమరులు

ఉమ్మడి జిల్లా నుంచి 30మంది పోలీసులు వివిధ సందర్భాల్లో ప్రాణాలు వదిలారు. అందులో నల్లగొండ జిల్లాకు సంబంధించి 15మంది ఉన్నారు. అమరవీరుల్లో ఎంఏ ఖలీం, ఎన్.శేఖర్‌రెడ్డి, కె.లక్ష్మయ్య, జి.వెంకటేశ్వర్లు, జి.సోమనర్సయ్య, నమోదురెడ్డి, లక్ష్మీనారాయణ, జి.లక్ష్మయ్య, వెంకటరత్నం, శ్రీనివాసులు, ఎం.అఫ్జల్ షరీఫ్, శ్రీరాంరెడ్డి, బడే సాహెబ్, కృష్ణారావు, ప్రసాద్, ఎం.శంకర్‌జీ, జి.గంగారామ్, శంకర్‌నాయక్, చెన్నకేశవులు, ఎస్‌కే జిలానీ, అహ్మద్ మోహినుద్దీన్, సత్తయ్య, చాంద్‌పాషా, సుల్తాన్ మోహినుద్దీన్, లింగ య్య, మహేశ్, సిద్దయ్య, లింగయ్య, సీహెచ్ నాగరాజు ఉన్నారు.

### పోలీసుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు

జిల్లా వ్యాప్తంగా పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాలు నిర్వహించి వారి త్యాగాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తారని, ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని నల్లగొండ, సూర్యాపేట ఎస్పీలు శరత్‌చంద్ర పవార్, సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఉత్సాహవంతులైన వారికి ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ పోటీలు, అమరులను స్మరిస్తూ క్యాండిల్ ర్యాలీలు, సైకిల్ ర్యాలీలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని, పోలీసు విధుల గురించి పోలీస్ ఓపెన్ హౌస్ చేపడుతామని పేర్కొన్నారు.

## జనసంద్రంగా ఉర్సు

**నల్లగొండ జిల్లా కేంద్రంలోని హజ్రత్ సయ్యద్ షా లతీఫ్ ఉల్లా ఖాద్రి ఉర్సు ఘనంగా కొనసాగుతున్నది. ఆదివారం నాలుగో రోజు ఉత్సవ కమిటీ పలు కార్యక్రమాలు చేపట్టింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉర్సు సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద జనం కొనుగోలుతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది.**



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు



దర్గా వద్ద భక్తుల రద్దీ




రామన్నపేటలో అదానీ కంపెనీ నిర్మించబోతున్న స్థలం వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

# రామన్నపేటలో 'అదానీ' గుబులు

## అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ స్థాపనకు చర్యలు

**రామన్నపేటలో అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటు చర్యలు ప్రజల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఎక్కడి నుంచి ఊడిపడ్డదో అని జనం టెన్షన్ పడుతున్నారు. ఒక్కసారి పరిశ్రమ ఏర్పాటైతే ఇక జీవకోటి మనుగడ ప్రశార్థకంగా మారుతుందని ఆందోళన చెందుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో పరిశ్రమను అడ్డుకుంటామని భీష్మించి కూర్చున్నారు.**

– యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ)

- ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో పెను ప్రమాదం
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆయా గ్రామాల ప్రజలు
- కొనసాగుతున్న రోజువారీ ఆందోళనలు
- ఇప్పటికే పెద్దఎత్తున ప్రభుత్వానికి మెయిల్స్
- ఈ నెల 23న ప్రజాభిప్రాయ సేకరణ

### లాజిస్టిక్ పార్కు పేరుతో కొనుగోలు..

గతంలో రామన్నపేటలో డ్రైపోర్టు, లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేస్తామంటూ అదానీ కంపెనీ రైతుల నుంచి వ్యవసాయ భూములను కొనుగోలు చేసింది. ఆ తర్వాత కొన్ని రోజులు స్తబ్ధుగా ఉన్న కంపెనీ.. ఉన్నపళంగా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించింది. నాడు కొనుగోలు చేసిన 365 ఎకరాల్లో సుమారు 65.5 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ. 1400 కోట్ల వ్యయం అవుతుందని, తొలి దశలో రూ. 700 కోట్లు, రెండో దశలో మరో రూ. 700 కోట్లు ఖర్చు చేస్తామని వెల్లడించింది.

### తీవ్రంగా వ్యతిరేకిస్తున్న జనం..

అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మా బతుకులు ఆగం చేసే పరిశ్రమ మాకెందుకని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే చుట్టు పక్కల 10 కిలోమీటర్ల దూరంలో ప్రభావం చూపుతుందని, దుమ్ము, ధూళి, గాలి ద్వారా ఊర్లన్నీ దుమ్మమయం అవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల ప్రజలు కాలుష్యంతో రోగాల బారిన పడి చెట్టుకొక్కరు, పుట్టకొక్కరుగా అవుతాయని ఆవేదన చెందుతున్నారు.

### స్థానికులకు 180 ఉద్యోగాలేనట..!

ఏ ప్రాంతంలోనైనా కంపెనీలు వస్తే స్థానికులకు ఉద్యోగాలు దొరుకుతాయని ఆశ పడతారు. కానీ అంబుజా సిమెంట్‌లో మాత్రం తొలి దశలో స్థానికులకు 90మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించింది. ఇందులోనూ 15 రెగ్యులర్, 75 కాంట్రాక్టులు పోస్టు లు ఉంటాయని వెల్లడించింది. రెండు విడుతలు కలిపి మొత్తంగా 180 జాబ్‌లు మాత్రమే ఇస్తామని స్పష్టం చేసింది. అంతేకాకుండా అర్హతను బట్టి ఉపాధిలో ప్రాధాన్యం ఇస్తామని మెలిక పెట్టింది.

### 23న ప్రజాభిప్రాయ సేకరణ

సిమెంట్ కంపెనీ ఏర్పాటుపై ప్రభుత్వం అభిప్రాయ సేకరణ చేపట్టనుంది. దీనికి సంబంధించి ఇప్పటికే పర్యావరణ శాఖ ప్రకటన చేసింది. ఈ నెల 23న రామన్నపేటలో ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించనుంది. దీనికి కలెక్టర్ లేదా అడిషనల్ కలెక్టర్ హాజరు కానున్నారు. అయితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేక వస్తున్న నేపథ్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుకు ప్లాన్ చేస్తున్నారు. 'అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. బలంగా వ్యతిరేకిస్తున్న మా నిర్ణయాన్ని ప్రజాభిప్రాయ సేకరణగా రిజిస్టర్ చేసుకోండి.. పర్యావరణానికి హాని కలిగించే కంపెనీకి ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దు. అని విద్యార్థులు, యువత, మేధావులు ee-nlg-tspcb@telgangana.gov.in అనే మెయిల్‌కు పెద్ద ఎత్తున పోస్టులు చేశారు.

### ఉపాధి కోల్పోతాం



రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటైతే మత్స్య పారిశ్రామికులు ఉపాధి కోల్పోతారు. మండల పరిధిలో కొమ్మాయిగూడెం పెద్ద చెరువు, రామన్నపేట వెంకట్రామయ్య చెరువు ఉన్నాయి. వీటిలో చేపలు పెంచుకుంటూ 130 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. అంబుజా సిమెంటు పరిశ్రమ ఏర్పాటు చేస్తే మా బతుకులు ఆగమైతయి. మత్స్యకార్మికులే కాకుండా చెరువుల మీద ఆధారపడి జీవించే కులవృత్తులు కూడా దెబ్బతింటాయి. చెరువుల ఆయకట్టు కింది రైతులకు సేద్యానికి నీరు ఉపయోగపడకుండా, పశువులకు ఉపయోగపడకుండా తీవ్ర నష్టం జరుగుతుంది.

**- కందుల హన్మంతు, మత్స్య కార్మిక పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్, రామన్నపేట**

### సిమెంట్ కంపెనీ ఏర్పాటును ఒప్పుకోము



సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించిన స్థలం మా ఇండ్లకు కూతవేటు దూరంలో ఉంటుంది. పరిశ్రమ ఏర్పాటైతే దాని నుంచి వచ్చే దుమ్ము, ధూళి మా ఇండ్లలోకి చేరుతుంది. కంపెనీ ప్రదేశం అతి చేరువలో ఉండడం వల్ల భయంకరమైన శబ్ధాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే సిమెంట్ పరిశ్రమను జనావాసాలకు దగ్గరగా పెట్టడం సరికాదు. పరిశ్రమ ఏర్పాటును ఎట్టి పరిస్థితిలో ఒప్పుకోము.

**-బాసరాజు ఇందు, గృహిణి, రామన్నపేట**

### పరిశ్రమతో గీత వృత్తికి ముప్పు



మండల పరిధిలో సుమారు వెయ్యి కుటుంబాలు గీతవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటు చేస్తే కల్లు కలుషితమై తాటి వనాలు నిర్వీర్యమయ్యే పరిస్థితి దాపురిస్తుంది. గీతకార్మికులు ఉపాధి కోల్పోయే ముప్పు ఉంది. తక్షణమే సిమెంట్ కంపెనీ ఏర్పాటు చేసే ఆలోచనను విరమించుకోవాలి. ప్రజలకు ఉపయోగపడే కాలుష్యరహిత కంపెనీని ఏర్పాటు చేయాలి.

**- పరిటాల రవి, కొమ్మాయిగూడెం, సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు**

### చేనేత వృత్తి దెబ్బతింటుంది



సిమెంట్ పరిశ్రమ వల్ల వచ్చే దుమ్ము, ధూళి వల్ల చేనేత పరిశ్రమ మనుగడ ప్రమాదంలో పడుతుంది. చేనేత వృత్తిలో ఆరకట్టడం, రంగులు అద్దడం వంటి ప్రక్రియలను ఆరుబయట చేయవలసి వస్తుంది. పరిశ్రమ వల్ల వచ్చే దుమ్ముతో వస్త్రాల నాణ్యత దెబ్బతింటుంది. తద్వారా మార్కెట్‌లో వస్త్రాల డిమాండ్ తగ్గిపోతుంది. వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉంది. పరిశ్రమ ఏర్పాటు యోచనను వెనక్కి తీసుకోవాలి.

**-చేనేత వృత్తి దారుడు, కైరంకొండ నాగభూషణ్, రామన్నపేట పట్టణ పద్మశాలి సంఘం ప్రధానకార్యదర్శి**



సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా కాలుష్య నియంత్రణ మండలికి మెయిల్ పంపుతూ అవగాహన కల్పిస్తున్న యువకులు

## అంబుజా సిమెంట్ పరిశ్రమ వద్దంటూ మెయిల్ ద్వారా నిరసన

రామన్నపేట, అక్టోబర్ 20 : రామన్నపేటలో అదానీ గ్రూప్ నిర్వహించ తలపెట్టిన అంబుజా సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేసే ఆలోచనను విరమించుకోవాలని స్థానిక ప్రజలు ఈమెయిల్ ద్వారా కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు తమ నిరసన తెలియజేస్తున్నారు. మండల కేంద్రంలో ఆదివారం పలువురు యువకులు ఈ మెయిల్‌కు పంపే మెసేజ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్య సిమెంట్ పరిశ్రమ వల్ల ప్రాణాంతకమైన ఊపిరితిత్తులు, చర్మవ్యాధులు, వస్తాయని, పంట పొలాలు దెబ్బతింటాయని, జీవరాసులు చనిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కాలుష్యం, శబ్ధ కాలుష్యంతో తమ ప్రాంత ఉనికికే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి అంబుజా సిమెంట్ పరిశ్రమకు అనుమతులు ఇవ్వద్దని, నలభై వేల మంది ప్రజలను బతికుండగానే చంపినట్లు అవుతుందని వాపోయారు. తమ ఆవేదనలను ఈ మెయిల్ రూపంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు పంపుతున్నట్లు చెప్పారు. ఈ నెల 23న నిర్వహించే అంబుజా సిమెంట్ పరిశ్రమ ప్రజాభిప్రాయ సేకరణను ముక్త కంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మిర్యాల మల్లేశం, బాలగోని శివకుమార్, బడుగు రఘు, కల్లూరి నరేశ్, ఎండీ అంజద్, బాసాని రాజు, జాల అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.